గృహ నిర్మాణ శాఖ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ప్రసంగిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

జిల్లాకు మంచిపేరు తీసుకొద్దాం

ఇళ్ల నిర్మాణాల లక్ష్యాన్ని చేరుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

గృహ నిర్మాణశాఖ అధికారులు, సిబ్బంది నిబద్ధతతో పని చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు సూచించారు. బుధవారం నాడు పుట్టపర్తి పట్టణంలోని సాయి ఆరామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ 1979వ సంవత్సరంలో హౌసింగ్ కార్పొరేషన్ ఏర్పడగా, 44 సంవత్సరాలు పూర్తయి 45వ సంవత్సరంలోకి అడుగుపెడుతోందన్నారు. హౌసింగ్‌లో ఒక్కో అధికారి తన సర్వీసులో అర్హత ఉన్న పేదవాళ్లకు వెయ్యికి తక్కువ కాకుండా, అంతకంటే ఎక్కువగానే ఇల్లు నిర్మిస్తున్నారని చెప్పారు. ఇది ఎంతో గొప్ప విషయం అన్నారు. ఎంతో నిబద్ధతతో పని చేసే అధికారులు గృహ నిర్మాణ శాఖలో ఉన్నారన్నారు. గతేడాది ముఖ్యమంత్రి జిల్లాలో 10 వేల ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యం ఇచ్చారన్నారు. ఇప్పటికే 11 వేలకు పైగా ఇళ్లు పూర్తి చేసి 100 శాతానికి పైగా అధికంగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారన్నారు. మళ్లీ ఇచ్చిన 15 వేల లక్ష్యానికి 83 శాతానికి పైగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడం అభినందనీయం అన్నారు. ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గృహ నిర్మాణ శాఖలో పనిచేసే ఉద్యోగులకు చెస్, క్రికెట్, క్యారం బోర్డ్, టగ్ ఆఫ్ వార్, టెన్నిస్, మ్యూజికల్ ఛైర్స్, రంగోలి క్రీడలు నిర్వహించారు. క్రీడల్లో గెలుపొందిన వారికి మెమొంటో, సర్టిఫికెట్లను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, డీఈలు నాగరాజు, షామీర్ బాషా, రంగనాయకులు, ఏఈలు, వర్క్ ఇన్స్‌పెక్టర్లు, డిఈవోలు పాల్గొన్నారు.

టమోటా మండీలు వెలవెల..!

- ◆ జిల్లాలో తగ్గిన సాగు
- ◆ గతంలో మార్కెట్‌కు వెయ్యి టన్నుల వరకు వచ్చేవి..
- ◆ ఇప్పుడు ఒక టన్ను కూడా బరువే..!
- ◆ దిగుబడల్లేక నింగినంటిన టమోటా ధర

రైతులు, వ్యాపారులు లేక ఖాళీగా ఉన్న అనంతపురంలోని టమోటా మండీ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్రంలో మదనపల్లి టమోటా మార్కెట్ తరువాత అనంతపురం మార్కెట్ అతిపెద్దది. సీజన్‌లో రోజుకు మూడు నుంచి నాలుగైదు టన్నుల వరకు టమోటా ఇక్కడికి వచ్చేది. అనంతపురం నగర శివారులోని కక్కలపల్లి పంచాయతీ పరిధిలో ఈ టమోటా మండీలు పెద్దఎత్తున ఉన్నాయి. 30 మండీల వరకు ఇక్కడ ఉన్నాయి. వీటి సీజన్ అయిన జూన్ నుంచి ఫిబ్రవరి వరకు టమోటా పంట ఇక్కడికి వస్తూ ఉంటుంది. ఇక్కడి నుంచి రాష్ట్రంలో స్థానిక మార్కెట్‌లతోపాటు అటు కర్నాటక, ఉత్తరాదిలో ఉత్తరప్రదేశ్, ఢిల్లీ వరకు అనంతపురం నుంచి లారీల్లో టమోటా వెలుతూ ఉంటుంది. ఈసారి సీజన్ ప్రారంభమైనా మార్కెట్‌కు సరుకు రావడం లేదు. దీంతో అనంతపురంలోని టమోటా మార్కెట్‌లు సరుకు లేక వెలవెలపోతున్నాయి.

వాతావరణ ప్రభావం...గిట్టుబాటు ధర లేక..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుమారు 20 వేల ఎకరాల వరకు టమోటా పంట సాగవుతుంది. చిత్తూరు తరువాత అత్యధికంగా ఇక్కడే ఈ పంట సాగవుతుంది. వేసవిలో ఇక్కడ ఎండలు అధికంగానున్న సమయంలో ఈ పంట దిగుబడులు సరిగా రావు. దీంతో ఏప్రిల్, మే మసాల్లో ఇక్కడ పంట ఉండదు. ఎండలు తగ్గే సమయానికి అంటే జూన్ నాటికి పంట వచ్చే విధంగా రైతులు బోరు బావుల కింద పంటలు సాగు చేస్తారు. గతేడాది వాతావరణ ప్రభావంతో రైతులు పెద్దఎత్తున పంట నష్టపోయారు. అటు వర్షాలు, ఇటు ఎండలు రెండింటి మూలంగా దెబ్బతినడమే కాకుండా ధర కూడా ఏ ఒక్క దశలో గిట్టుబాటు లభించలేదు. దీంతో మేలో సాగు చేయాలనుకున్న రైతులు పెద్దగా ఆసక్తి చూపలేదు. దీంతో దిగుబడులు జూన్ నాటికి రావాల్సినవి తగినంత రాలేదు. జూన్ నాటికే టమోటా మండీలు తెరచుకున్నప్పటికీ పంట స్థానికంగా లేకపోవడంతో ఇప్పటికీ సరుకు లేక మండీలు వెలవెలబోతున్నాయి. వెయ్యి టన్నుల వరకు ఈ సమయానికి పంట వచ్చేది ఇప్పుడు అది వచ్చే పరిస్థితి లేదు. పంట లేకపోవడంతో టమోటా ధర సైతం కిలో వంద రూపాయలకు చేరింది.

వాతావరణ ప్రభావం ఉంది...

ఈసారి ఏప్రిల్, మే మాసాల్లో ఎండల తీవ్రత అధికంగా ఉంది. మేలోనూ ఈ తీవ్రత కొనసాడంతో పంటల సాగుపై ప్రభావం పడింది. మేలో పెద్దగా టమోటా పంట జిల్లాలో సాగవలేదు. ఇప్పుడిప్పుడు సాగు జరుగుతోంది. ప్రస్తుతం ఎనిమిది వేల ఎకరాలకుపైగా సాగైంది. ఈ పంట వచ్చే మాసానికి దిగుబడులు వచ్చే అవకాశముంది. ఎండ తీవ్రత తగ్గుతున్న కొద్దీ పంట వస్తుంది. కాబట్టి వచ్చే రెండు మాసాల్లో టమోటా పంట వస్తే ధరల్లో స్థిరత్వం వచ్చే అవకాశాలున్నాయి.

రఘునాథరెడ్డి, ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్.

రోజుకు 50 వేల బాక్సులొచ్చేవి...

అనంతపురం టమోటా మార్కెట్‌కు సాధారణంగా ఈ సమయానికి రోజుకు 50 వేల బాక్సులైనా టమోటా వచ్చేది. ఈసారి వెయ్యి, రెండు వేలు కూడా రావడం లేదు. వాతావరణ ప్రభావంతో రైతులు మేలో పంట సాగు చేయలేకపోయారు. దీంతో సీజన్‌లో రావాల్సిన టమోటా పంట దిగుబడి రాలేదు. ఈ ప్రభావం ధరలపైనా పడుతోంది. బయట కర్నాటకలో కొంత ఉన్నప్పటికీ స్థానిక మార్కెట్‌లకే అది సరిపోతోంది. ఇక్కడికి రావడం లేదు.

నజీర్, టమోటా వ్యాపారి.

ప్రభుత్వాలకు సరైన ప్రణాళిక లేకనే...

పంటల సాగు, దిగుబడులు, వాటికి గిట్టుబాటు ధర కల్పించడంపై ప్రభుత్వాలకు సరైన ప్రణాళిక లేకపోవడంతోనే ఈ సమస్య వస్తోంది. గతేడాది పంటలు సాగు చేసిన రైతులకు సరైన గిట్టుబాటు ధరలేదు. ప్రకృతి వైపరిత్యాలతో నష్టపోతే పరిహారమూ సక్రమంగా అందివ్వలేదు. అందుకే ప్రభుత్వాలు ధర స్థిరీకరణపై దృష్టి సారించాల్సిన అవసరముంది. డిమాండ్‌కు తగ్గట్టు మార్కెట్‌లో పంట దిగుబడులుండే విధంగా ప్రణాళిక ఉంటే ఈ సమస్య ఉండదు.

చంద్రశేఖర్‌రెడ్డి, ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

పార్టీ నిర్ణయం శిరోధార్యం

పురంలో నమ్ముకున్న ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటా...
ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్

ప్రజాశక్తి-హిందూపురం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం ఇన్‌ఛార్జి నియామకంలో వైసిపి అధిష్టానం తీసుకున్న నిర్ణయం తనకు శిరోధార్యం అని, దీనికి తాను కట్టుబడి ఉన్నట్లు ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ తెలిపారు. హిందూపురం వైసీపీలో కీలక పరిణామాలు చోటు చేసుకున్న నేపథ్యంలో బుధవారం నాడు ఎమ్మెల్సీ తన నివాసం వద్ద మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఒక నిర్ణయం తీసుకుని హిందూపురం ఇన్‌ఛార్జ్‌గా దీపిక వేణురెడ్డిని నియమించిందన్నారు. ఈ నిర్ణయానికి తాను తన మద్దతుదారులు కట్టుబడి ఉంటాం అన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా హిందూపురం నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజల బాగోగుల కోసం శక్తివంచన లేకుండా పని చేశానన్నారు. తాను ఎక్కడ ఉన్నా ఈ ప్రాంత ప్రజల క్షేమం కోసం పని చేస్తానని చెప్పారు. 2024 ఎన్నికల్లో హిందూపురంలో టిడిపి కంచుకోటను బద్దలు కొట్టి వైసిపి జెండా ఎగుర వేయాలన్నదే తన లక్ష్యం అన్నారు. హిందూపురంలో తనను నమ్ముకున్న ప్రతి కార్యకర్తకూ న్యాయం చేస్తానన్నారు. తాను ప్రస్తుతం హిందూపురంలో లేనని ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. కొద్దిరోజులు వ్యక్తిగత పనులు నిమిత్తం హైదరాబాదుకు వెళుతున్నట్లు తెలిపారు. తన వ్యక్తిగత పనులు చూసుకుని హిందూపురం తిరిగి వస్తానని చెప్పారు.

చేనేత పాలసీని వెంటనే అమలుచేయాలి

ఎపి చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజనేయులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

మాట్లాడుతున్న పోలా రామాంజనేయులు

రాష్ట్రంలో చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయిందని, ఈ పరిశ్రమ కాపాడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని వెంటనే చేనేత పాలసీని అమలు చేయాలని ఎపి చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజినేయులు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరునెలల నుంచి చేనేతపరిశ్రమ మరింత తీవ్రసంక్షోభంలోకి కూరుకుపోయిందన్నారు. ముఖ్యంగా ఏదైనా విపత్తు వచ్చినప్పుడు నిధులు కేటాయించి ఎలా ఆదుకుంటారో, అలాగే చేనేతకు విపత్తు వచ్చిందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం కలుగజేసుకుని వస్త్రాలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత పరిశ్రమ దెబ్బతినడానికి కారణం చేనేత రకాలను పవర్‌లూమ్స్‌లో నేయడం వల్లనేనని అన్నారు. సిఎం జగన్ అన్ని విషయాలు మాట్లాడుతున్నారే కానీ చేనేత పరిశ్రమ గురించి మాట్లాడలేదన్నారు. చేనేత కార్మికుని కుటుంబానికి రూ.1లక్ష రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పరిశ్రమ సంక్షోభం నుండి బయటపడటానికి రూ.1000 కోట్లు చేనేత పరిశ్రమకు కేటాయించాలన్నారు. ధర్మవరం నుంచి ఇతర ప్రాంతాలకు చీరలు అప్పుగా ఇచ్చినప్పుడు తిరిగి వాటి బకాయిలు వసూలు చేసేటప్పుడు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో చేనేత పరిరక్షణ కోసం ఒక సెల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్ ఆదినారాయణ, జంగాలపల్లి పెద్దన్న, నాగార్జున పాల్గొన్నారు.

రాగిపంట సాగుపై అవగాహన

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

రాగి పంట సాగు పై రైతులకు అవగాహన కల్పించి రాగి పంటసాగు విస్తీర్ణం మరింత పెంచాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్ ఆదేశించారు. రాగి పంట సాగుపై సంబంధిత అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రాగి పంటకు ప్రభుత్వం రూ. 3846 కనీస మద్దతు ధర కల్పిస్తోందని పంట సాగు పెంచే విధంగా క్షేత్రస్థాయిలో రైతులను అవగాహన కల్పించాలని అన్నారు. రాగి పంట సాగు అనంతరం వివరాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని, అందుకు సంబంధించిన రిపోర్టులను ఎప్పటికప్పుడు నివేదించాలని ఆదేశించారు. సబ్సిడీ విత్తనాలను మినీ కిట్లను అందుబాటులో ఉంచాలని సీడ్స్ అధికారులను ఆదేశించారు. ఈ సీజన్‌లో ఈ క్రాఫ్ బుకింగ్ చేపట్టాలని ప్రతి ఎకరం వివరాలు నమోదు చేయాలని అన్నారు. కౌలు రైతులకు అందించే సిసిఆర్‌సి కార్డులను జగనన్న సురక్ష కార్యక్రమంలో పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఎస్‌ఒ వంశీకృష్ణ, పౌరసరఫరాల శాఖ డిఎమ్ అశ్వర్థ నారాయణ నాయక్, ఏపీ సీడ్స్ డిఎమ్ ధనలక్ష్మి, వ్యవసాయ శాఖ ఏడీలు రవీంద్ర, కృష్ణమీనన్, స్వయం ప్రభ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - హిందూపురం

గుత్తేదారులతో సమీక్షిస్తున్న కమిషనర్ ప్రమోద్ కుమార్

హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా ఇప్పటికే గుత్తేదారులు టెండర్ అయి, అగ్రిమెంట్ పూర్తి అయిన పనులను నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ గుత్తేదారులను ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ మున్సిపల్ ఇంజనీర్లతో కలిసి గుత్తేదారులతో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతు పురపాలక సంఘ వ్యాప్తంగా 10 మంది గుత్తేదారులు 100 పనులకు అగ్రిమెంట్ చేశారని అయితే ఇంత వరకు పనులను ప్రారంభించలేదని అన్నారు. వీటిని వెంటనే ప్రారంభించి పనులను పూర్తి చేయాలన్నారు. గత మూడు సంవత్సరాలుగా చేసిన పనులకు సంబందించి గుత్తేదారులకు ప్రభుత్వం నుంచి రూ.11.38కోట్లు నిధులు విడుదల అయ్యాయని చెప్పారు. గత రెండు నెలల్లో 98.6లక్షల బిల్లులు మంజూరు చేశామన్నారు. అయితే హిందూపురం పురపాలక సంఘంలో రూ.9.78కోట్ల అభివృద్ధి పనులకు టెండర్లు పూర్తి చేసి, అగ్రిమెంట్‌లు చేసుకుని పనులు చేయడం లేదన్నారు. ఇందులో 31 పనులు గడప గడపకు మన ప్రభుత్వం పనుల్లోఉన్నాయన్నారు. దీనికి సంబందించి రూ.1.72కోట్లు నిధులు సిద్దంగా ఉన్నాయన్నారు. పనులు చేసిన వెంటనే బిల్లులు మంజూరు చేస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ అధికారులు, గుత్తేదారులు పాల్గొన్నారు.

మంత్రికి ఘన స్వాగతం

చిలమత్తూరు : కర్నాటక సరిహద్దు ప్రాంతం కర్నాటక టోల్ గేట్ వద్ద విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డికి స్థానిక వైసిపి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.హిందూపురం నియోజక వర్గ సమన్వయకర్తగా దీపికరెడ్డిని ఎన్నుకున్న నేపథ్యంలో ఆ వర్గానికి చెందిన నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని పూలహారాలు శాలువలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అబ్దుల్ ఘనీ, బలరాంరెడ్డి, మారుతీరెడ్డి, ఎంపిపి పురుషోత్తమరెడ్డి, మాజీ మండల కన్వీనర్ సదాశివరెడ్డి, షాకీర్, కులశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫీజులు తగ్గించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-హిందూపురం

డిగ్రీ విద్యార్థులకు పెంచిన సెమిస్టర్ పరీక్షల ఫీజులను తగ్గించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బిసి కళాశాల వసతిగృహం వద్ద విలేకరులతో మాట్లాడారు. శ్రీకృష్ణ దేవారాయ విశ్వవిద్యాలయ పరిధిలో సెమిస్టర్ పరీక్షలకు రూ.550 ఉన్న ఫీజును ఒకటికి రెండింతలు పెంచడం దారుణమన్నారు. 4వ సెమిస్టర్ రూ.1050, బికాం 6వ సెమిస్టర్‌కు రూ. 1950, బిబిఎకు రూ. 2200 వరకు ఫీజులు పెంచడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అతివృష్టి, అనావృష్టితో రైతులకు పంటలు చేతికందక చేసిన అప్పులను తీర్చలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. ఇలాంటి సమయంలో రైతు కుటుంబాలకు చెందిన విద్యార్థులు పెంచిన ఫీజులను ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. ఇది చాలదన్నట్లు మార్కులకార్డు, మైగ్రేషన్, టిసి పేర్లతో డబ్బులు కట్టించుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ విధానం చూస్తుంటే కేవలం విద్యార్థులతో అధికమొత్తంలో వసూలు చేయడానికే పరీక్షల ఫీజులు కట్టించుకుంటున్నారని తెలుస్తోందన్నారు. అదేవిధంగా పరీక్ష ఫీజు చెల్లించే గడువు ముగిసిన వెంటనే రూ. 5000 నుంచి 10వేల రూపాయల వరకు అదనంగా వసూలు చేస్తున్నారని విమర్శించారు. ఒక పక్క విద్యా దీవెన, వసతి దీవెన పేరుతో విద్యార్థులకు ఇచ్చిన డబ్బులను ప్రభుత్వం ఈ విధంగా వారి నుంచి తిరిగి రాబట్టుకుంటోందని విమర్శించారు, వెనుక బడిన ఉమ్మడి అనంత జిల్లా విద్యార్థులకు పరీక్షా ఫీజులను మినహాయించి దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి విద్యా దీవెనతో పాటు ఉపకార వేతనాలు మంజూరు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విశ్వ విద్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు చంద్రశేఖర్, హర్షకుమార్, భగత్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాబావలి

కెజిబివిపై అధికారి పెత్తనం..!

- ◆ ఆ మేడం చెప్పిందే అక్కడ నిబంధన
- ◆ పిల్లల్ని కలిసేందుకు కూడా తల్లిదండ్రులకు అనుమతి నిరాకరణ
- ◆ ఇదేమిటంటే టీసీ తీసుకెళ్లండి అంటూ హుకూం
- ◆ 'తనకల్లు కెజిబివి' తీరుపై తల్లిదండ్రుల అసహనం

ప్రజాశక్తి-కదిరి టౌన్, తనకల్లు

చదువుకునే ఆర్థిక స్థోమత లేని పేద విద్యార్థులు కస్తూరిబా పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. విద్యార్థులకు చదువుతో పాటు భోజనం, వసతి అదే పాఠశాలలో ఉంటుంది. పేద విద్యార్థులు చదువుకునే ఇలాంటి పాఠశాలల్లో వారి పట్ల కనికరం చూపించాల్సిన అధికారులే ఇష్టానుసారంగా వ్యవహరించి వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. పిల్లలతో స్నేహంగా ఉండి, వారి సంరక్షణ బాధ్యతలను తీసుకోవాల్సిన కస్తూరిబా పాఠశాల ప్రధాన అధికారి అందుకు విరుద్ధంగా నడుచుకుంటున్నట్లు తెలుస్తోంది. కదిరి డివిజన్‌లోని తనకల్లు కస్తూరిబా పాఠశాల ప్రధాన అధికారి నిబంధనల పేరుతో అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.

తనకల్లు మండల కేంద్రంలో కస్తూరిబా పాఠశాల ఉంది. ఇక్కడ ఇన్‌ఛార్జి స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న అధికారిపై ఇటీవల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వివిధ నిబంధనల పేరుతో అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రులను ఇబ్బందులు పెడుతున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. పిల్లల బాగోగులు, చదువుపై ఏదైనా సమస్య చెబుదామంటే కూడా ఆ పాఠశాలలోకి తల్లిదండ్రులను అనుమతి ఇవ్వడం లేదు. ఏదైనా ప్రధాన గేటు బయట నుంచే మాట్లాడి వెళ్లాల్సిందే. చేసేది లేక తల్లిదండ్రులు గేటు వద్దే వారి పిల్లలతో మాట్లాడి వెను దిరుగుతున్నారు. ఇదేమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తే 'ఇష్టం ఉంటే ఉండండి, లేకుంటే టిసి తీసుకుని వెళ్లిపోండి' అనే సమాధానం ఆ అధికారి నుంచి వస్తోంది. పాఠశాలలో చదువుతున్న పిల్లలను చూసి వారి యోగక్షేమాలు తెలుసుకోవాలని గంపెడాశతో కస్తూరిబా పాఠశాల వద్దకు వస్తున్న విద్యార్థుల తల్లిదండ్రుల పట్లకూడా సదరు అధికారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. 'ఇష్టముంటే ఉండండి లేకుంటే టీసీ తీసుకువెళ్లండి. తనని ఎవరూ ఏమి చేయలేరు' అన్న రీతిలో ఆ అధికారి తల్లిదండ్రులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థినిపై చేయిచేసుకున్న అధికారి.?

తనకల్లు కస్తూరిబా పాఠశాల ముఖ్య అధికారి ఇటీవల ఓ విద్యార్థినిపై చేయిచేసుకున్నట్లు తెలుస్తోంది. ఆ విద్యార్థి ఏడుస్తూ గేటు వద్ద ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెబుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. అమ్మానాన్నలతో మాట్లాడతానని చెప్పినందుకు అధికారి కొట్టిందంటూ ఆ విద్యార్థిని ఏడూస్తూ చెప్పింది. ఈ సమయంలో కూడా ప్రశ్నించిన తల్లిదండ్రులను అధికారి ఇష్టం లేకపోతే టీసీ తీసుకుని వెళ్లండి అంటూ ఆగ్రహావేశంతో సమాధానం ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో ఉన్నతాధికారులు తనకల్లు కెజిబివిని సందర్శించి అక్కడి విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాఠశాలలోకి అనుమతించరు..

తనకల్లు కస్తూరిబాలో నెలకొన్న సమస్యలను తెలుసుకుందామంటే విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు ఎవరినీ లోపలికి అనుమతించడం లేదు. పాఠశాలలో వసతులు ఏమున్నాయో తెలియని పరిస్థితి ఉంది. దీనిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా కొరవడింది. పాఠశాలలో విద్యార్థినులతో పనులు చేయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. నెలకు ఒకసారి నిర్వహించాల్సిన విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ సమావేశం కూడా నామమాత్రంగానే జరుగుతోంది. ఈ సమస్యలన్నింటినీపై ఉన్నతాధికారులు తెలుసుకోవాలంటే తనకల్లు కెజిబివిని క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలి. అప్పుడే వాస్తవ విషయాలు వెలుగులోకి వస్తాయి.

బాబ్జాన్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు.

తనకల్లు కేజీబీవీ పాఠశాల

బురదనీటిలో ప్లేట్లు కడిగే పరిస్థితి

తనకల్లు కస్తూరిబా బాలికల విద్యాలయంలో నీటి సమస్య ఉంది. దీంతో విద్యార్థులు పాఠశాల ఆవరణంలో ఉన్న కొద్దిపాటి బురద నీటిలోనే ప్లేట్లు కడుక్కోవాల్సిన పరిస్థితి ఉంది. ఇలా బురద నీటిలో ప్లేట్లు కడుగుతూ అందులోనే మళ్లీ భోజనం తినడం వల్ల విద్యార్థినులు అనారోగ్యం పాలయితే ఎవరు బాధ్యత వహిస్తారంటూ తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇక పాఠశాల ఆవరణమంతా గడ్డి మొక్కలతో నిండిపోయింది. రాత్రి సమయాల్లో విషపురుగుల సంచారంతో విద్యార్థినులు బిక్కుబిక్కుమంటూ జీవించాల్సిన దుస్థితి ఏర్పడింది.

నిబంధనల మాత్రమే అమలు చేస్తున్నాం

తనకల్లు కెజిబివిలో ప్రభుత్వ నిబంధనల మాత్రమే అమలు చేస్తున్నాం. తల్లిదండ్రులు వారికి సూచించిన సమయంలో మాత్రమే పిల్లల్ని కలవలనే ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయి. ఆ మేరకే తల్లిదండ్రులకు అనుమతులు ఇస్తున్నాం. పాఠశాలలో విద్యార్థులు ఎవరినీ కొట్టడం లేదు. గతంలో పాఠశాలలో మోటారు మరమ్మతు వల్ల కొద్ది రోజులు బురదనీళ్లు వచ్చిన మాట వాస్తవమే. ఈ సమస్యను ప్రస్తుతం పరిష్కరించాం.

విజయలక్ష్మి, ఇన్‌ఛార్జి ఎస్‌ఒ.

సిఎంను కలిసిన బత్తల హరిప్రసాద్, తదితరులు

సిఎం జగన్‌ను కలిసిన డాక్టర్ 'బత్తల'

కదిరి టౌన్ : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్,బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తల వెంకట రమణ ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారేష్ తదితరులతో పాటు బత్తల సిఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సిఎం జగన్ బత్తల హరిప్రసాద్‌కు సూచించినట్లు నాయకులు తెలిపారు.

నేడు కిరికెరలో భూ హక్కుపై గ్రామసభ

హిందూపురం : వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా హిందూపురం రూరల్ మండలం కిరికెర గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు రీసర్వే తహశీల్దార్ ప్రసాద్ తెలిపారు. తహశీల్దార్ అధ్యక్షతన జరిగే ఈ గ్రామసభలో మండల, గ్రామ సర్వేయర్లతో పాటు విఆర్ఓలు పాల్గొని రైతులకు వారి విస్తీర్ణం తెలుపు 9(2)నోటీసులు జారీ చేయడం జరుగుతుందన్నారు. ఇందులో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ప్రజలు 10(2) నందు అప్పీలు చేసుకోవాలని చెప్పారు.

ఎంఇఒలకు సన్మానం

ధర్మవరం టౌన్ : ధర్మవరం ఎంఇఒ -1రాజేశ్వరి, ఎంఇఒ -2 గోపాల్‌నాయక్‌ను యుటిఎఫ్ నాయకులు బుధవారం సన్మానించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి సమక్షంలో నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణనాయక్, ఆంజనేయులు, లక్ష్మయ్య, రాంప్రసాద్, రామాంజినేయులు, విజయభాస్కర్, సాయిగణేశ్, జనార్ధన్, ఓబిరెడ్డి, లక్ష్మీనారాయణ, సాకే లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : ఎంఇఒ 1 సురేష్ బాబు, ఎంఇఒ 2 రమణను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో 98 జిల్లా ఉపాధ్యాయుల ప్రధాన కార్యదర్శి కె నాగరాజ్, శంకర్ నాయుడు, రమణ, నీలకంఠప్ప ,భాస్కర్, ప్రసాద్, ఖాసీం, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అంతమే లక్ష్యం

ధర్మవరం టౌన్ : అవినీతి అంతమే ఆమ్‌ఆద్మీ పార్టీ లక్ష్యమని ఆపార్టీ జిల్లా కన్వీనర్ కేఎం అసదుల్లా తెలిపారు. పట్టణంలోని శారదానగర్లో బుధవారం ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు పర్యటించి ప్రజలకు పార్టీ విధి విధానాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అసదుల్లా మాట్లాడుతూ ఆమ్ ఆద్మీ పార్టీ ఒక విలువలతో కూడిన పార్టీ అన్నారు. అవినీతిని అంతం చేసి మంచి సుపరిపాలన అందిస్తామని తెలిపారు. ఆటో మొబైల్స్ మెకానిక్‌లు, షాపు యజమానులకు పార్టీ చేయబోయే కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. త్వరలో ధర్మవరంలో పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ ట్రెజరర్ అల్లాబకాష్, కోఆర్డినేటర్ శ్రీకాంత్‌నాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

రొద్దం : మండలంలోని ఎం కొత్తపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త నాగరాజు అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బికె. పార్థసారథి బుధవారం కొత్తపల్లికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నాగరాజు, మాజీ సర్పంచి నారాయణప్ప, పెద్ద వీరప్ప, చిన్న సుబ్బరాయుడు, బుడ్డన్న, రాజప్ప తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యా బోధన అందించాలి

బుక్కపట్నం : నూతన విద్యా విధానంలో వస్తున్న సరికొత్త మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలని ఆర్‌జెడి నాగలింగారెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావ్యవస్థలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలన్నారు. అధ్యాపకులు బోధన ప్రామాణికతను మెరుగుపరచుకొని విద్యాబోధన చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, అధ్యాపకులు వెంకటేశ్వర ప్రసాద్, దస్తగిరి, ఆదినారాయణ, చంద్రమోహన్, ఓబయ్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని 39 వ వార్డు రాంనగర్లో మంగళవారం రాత్రి నీళ్లూరి పుల్లమ్మ అనే మహిళ పాముకాటుతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న అవార్డు కౌన్సిలర్ కడప రంగస్వామి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతురాలి అంత్యక్రియల కోసం తన వంతుగా రూ. 5వేలను అందజేశారు.

ఆర్థికసాయం అందజేస్తున్న కౌన్సిలర్ రంగస్వామి

ఎస్సీ, ఎస్టీలను దేవాలయాల్లోకి రానివ్వకుంటే క్రిమినల్ కేసులు

కలెక్టర్ అరుణ్ బాబు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఎస్సీ ఎస్టీలు దేవాలయాల్లోకి రాకుండా అడ్డుకునే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు హెచ్చరించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి, ఎస్పీ మాధవరెడ్డి, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. అట్రాసిటీ చట్టంపై ఎస్సీ ఎస్టీ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కమిటీ సభ్యులకు సూచించారు. 15 రోజులలోపు జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణం కోసం అవసరమైన స్థలాన్ని సేకరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎస్సీ ఎస్టీలకు శ్మశాన వాటిక కోసం అవసరమైన స్థలాలను సేకరించాలన్నారు. ప్రతినెల ఆయా మండలాల పరిధిలోని ఒక గ్రామంలో మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలని అందుకు ఆర్డీవో, తహశీల్దార్లు బాధ్యత వహించి కమిటీ సభ్యులకు ముందుగా తెలపాలన్నారు. అంతకుమునుపు మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ, ఎస్సీ ఎస్టీల అభ్యున్నతకి కమిటీ కృషి చేయాలన్నారు. అంబేద్కర్ భవన నిర్మాణం, శ్మశాన వాటికలు త్వరగతిన పూర్తిచేయాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. విజిలెన్స్ మరియు మానిటరింగ్ సభ్యులు మాట్లాడుతూ శ్మశాన వాటికలు చాలా గ్రామాల్లో లేనందున సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఆ వర్గాల ప్రజలు సమస్యలపై అధికారుల వద్దకు వచ్చినప్పుడు సత్వరమే పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శివరంగ ప్రసాద్, ఆర్డీవోలు భాగ్యరేఖ, తిప్పే నాయక్, సిపిఒ విజయ్ కుమార్, డీఎస్పీలు వాసుదేవన్, శ్రీలత, వరప్రసాద్, శ్రీనివాసులు, హుస్సేన్ పీరా, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, ఎస్టీ సంక్షేమ అధికారి మోహన్ రావు, కమిటీ సభ్యులు నరసింహమూర్తి, వెంకటేశు, గంగులయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చలు విఫలం

మోటార్లు నిలిపేసి కార్మికుల నిరసన

అనంతపురం కలెక్టరేట్ : ఉమ్మడి అనంతపురం జిల్లా శ్రీ సత్యసాయి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికుల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, శ్రీసత్యసాయి కార్మికుల యూనియన్ నాయకులతో చేపట్టిన చర్చలు విఫలం అయ్యాయి. బుధవారం నాడు శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో తెల్లవారు జామున పంపుమోటార్లు నిలిపి వేసి నిరసన చేట్టారు. విషయం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు యూనియన్ గౌరవాధ్యక్షులు జి.ఓబులు నేతృత్వంలోని కమిటీ నాయకులతో శ్రీసత్యసాయి బోర్డ్ కార్యాలయంలో చర్చలు నిర్వహించారు. యూనియన్ నేతలు గతంలో సమ్మె చేపట్టిన సమయంలో ఇచ్చిన హామీలు ఇంతవరకు నెరవేర్చలేదని నిరసన తెలిపారు. చర్చల సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, శ్రీసత్యసాయి తాగునీటి కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షులు ఓబులు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ రామారావుకు పలు సమస్యలు వివరించారు. 3 నెలల వేతనాలు, 11 నెలల పియఫ్,14 నెలల ఇఎస్ఐ, బోనస్, లీవ్ ఇన్ క్యాష్‌మెంట్, బకాయి చెల్లించాలన్నారు. ఇదివరకే 8 నెలల సమ్మె సందర్భంగా ఒప్పందం ఇచ్చినప్పటికీ అమలుకాలేదన్నారు. ఈ సందర్భంగా శ్రీసత్యసాయి వాటర్ సప్లై బోర్డ్ మెంబర్ సెక్రటరీ మాట్లాడుతూ ఒక నెల వేతనం చెల్లిస్తామని చెప్పారు. కార్మికులు సమ్మె కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. దీనిపై కార్మిక యూనియన్ నాయకులు సమ్మె కొనసాగిస్తామనే అభిప్రాయాన్ని అధికారులకు తెలిపారు. అనంతరం బోర్డ్ ఆఫీస్ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఓబులు, జిల్లా కార్యదర్శి నాగేంద్ర, తిప్పేస్వామి మాట్లాడుతూ కార్మికులను భయపెట్టే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు విధుల్లోకి వెళ్లరన్నారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయన్న ఆశాభావంతో నిరసన చేస్తున్న నేపథ్యంలో అధికారులు ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి కార్మికుల యూనియన్ నాయకులు శ్రీనివాసులు, మధు, రవిచారి, లక్ష్మిరెడ్డి, నబీరసూల్, వవన్నారుస్వామి, మహానంది, డివైఎఫ్ఐ నాయకులు రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్ పాల్గొన్నారు.

గోడపత్రికలను విడుదల చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలి

హిందూపురం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలకు బడ్జెట్‌ను పెంచి ఆదుకోవాలని అంగన్‌వాడి యూనియన్ ప్రధాన కార్యదర్శి లావణ్య డిమాండ్ చేశారు. ఈ నెల 10, 10వ తేదీల్లో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ఆందోళన కార్యక్రమాలను విజవంతం చేయాలని కోరుతు బుధవారం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతు ఎన్నికల సమయంలో జగన్ మోహన్ రెడ్డి ఎన్నో హామీలిచ్చారన్నారు. అధికారం చేపట్టి నాలుగు సంవత్సరాలు పూర్తి అయినా నేటికీ వాటిని నేరవేర్చలేదన్నారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు అంగన్వాడీ కార్యకర్తలకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. అలాగే గ్రాడ్యూటి అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ. 5 లక్షలు ఇవ్వాలని, రిటైడ్ అయిన తర్వత పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఈ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ లీడర్లు భాగ్యమ్మ, రత్నమ్మ, ధనమ్మ, పద్మ, గీతావాణి తదితరులు పాల్గొన్నారు.

మడకశిర అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా : గుండుమల

సమావేశంలో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

ప్రజాశక్తి మడకశిర రూరల్

మడకశిర నియోజకవర్గంలో ఈ నాలుగేళ్లలో చేసిన అభివృద్ధిపై బహిరంగచర్చకు టిడిపి నాయకులు ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. బుధవారం పట్టణంలోని బాలాజీ నగర్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం శాశ్వత సంక్షేమ కార్యక్రమాలు చేపడితే వైసిపి ప్రభుత్వంలో చిన్న చిన్న అభివద్ధి కార్యక్రమాలు కూడా చేయలేని స్థితిలో స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి ఉన్నారని విమర్శించారు. అలాంటి వ్యక్తికి చంద్రబాబు గురించి విమర్శించేది స్థాయి లేదని అన్నారు. శిరా నుండి కోడికొండ చెక్‌పోస్టు వరకు జాతీయ రహదారిని తెచ్చిన ఘనత చంద్రబాబుదే నన్నారు. మడకశిర నియోజకవర్గంలో మూడు గురుకుల పాఠశాలలు, మూడు గురుకుల జూనియర్ కాలేజీలు తీసుకురావడంతో పాటు రైతులకు లో వోల్టేజ్ సమస్య పరిష్కారం కోసం రూ. 100 కోట్లతో హెచ్ వి డి ఎస్ పథకం ద్వారా వేల సంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసిన ఘనత టిడిపిది అని అన్నారు. రూ. 40 కోట్లతో పట్టణంలో రోడ్డు విస్తరణ చేసి 80 శాతం పూర్తి చేస్తే మిగిలిన 20 శాతం పనుల్లో భాగంగా రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను కూడా తొలగించే శక్తి ఎమ్మెల్యేకు లేదని ఎద్దేవా చేశారు. ధైర్యంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్లలేని స్థితిలో ఉన్నారన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరు ఎవరినైనా విమర్శించవచ్చు అని అలా విమర్శిస్తే ప్రతిపక్ష నేతలపై కేసులు పెడతారా అని నిలదీశారు. మరో మారు ప్రతిపక్ష నేతలపై కేసులు పెడితే పోలీస్ స్టేషన్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, దాసిరెడ్డి మనోహర్, డాక్టర్ కృష్ణమూర్తి, తెలుగు యువత నాయకుడు తిమ్మరాజుతో పాటు నాయకులు జై కుమార్, పుల్లయ్య చౌదరి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి : చిలకం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

వైసీపీ నాలుగేళ్లపాలనలో రాష్ట్రం రావణకాష్టంలా మారిందని జనసేనపార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలోని 1,2 వార్డులలో బుధవారం నిర్వహించిన సేవ్ ధర్మవరం కార్యక్రమంలో చిలకం మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రజాసమస్యలు అడిగితెలుసుకున్నారు. వైసీపీ నాలుగేళ్ల పాలనలో ప్రజలకు ఇంతవరకు ఏమిచేశారో ప్రజలకు చెప్పాలన్నారు. ధర్మవరంలో రౌడీరాజ్యం సాగుతోందని ఆరోపించారు. ఎవరైన ఎదురుతిరిగిమాట్లాడితే వారిపై దాడులు చేయించడం ధర్మవరంలో పరిపాటిగా మారిందన్నారు. రాష్ట్రంలో ఈ రౌడీ రాజ్యం పోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - తలుపుల

పంటనష్టపోయిన అర్హులైన రైతులందరికీ తక్షణసాయంగా ఎకరాకు రూ.10వేలు అందజేయాలని ఎపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతుసంగం నాయకులు జెవి. రమణ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తరహా మన రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సాగు సాయంగా ప్రతి రైతుకు ప్రతి ఎకరాకు రూ. 10వేలు అందించాలని 50 సంవత్సరాలు పూర్తయిన ప్రతి రైతుకు పదివేల రూపాయలు పింఛను ఇవ్వాలని కోరారు. ప్రతి పంటకు వాతావరణ బీమా ఇవ్వాలన్నారు. స్వామినాథన్ కమిషన్ ప్రకారం ప్రతి పంటకు పెట్టిన పెట్టుబడితో కలిపి 50శాతం అదనంగా ఇవ్వాలన్నారు. రైతు సమస్యలను వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు సి ముత్యాలప్ప, సిపిఐ మండల కార్యదర్శి ఈశ్వరయ్య గౌడ్, టిడిపి నాయకులు ఎద్దుల రాముడు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్‌పై చర్యలకు డిమాండ్

కదిరి టౌన్ : తలుపుల వార్డెన్ భాస్కర్ పై చర్యలు తీసుకోవాలని రాయలసీమ విద్యార్థి యువజన సంఘం నాయకులు అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు.రాయలసీమ విద్యార్థి యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక కదిరి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరుణ్ కుమార్ మాట్లాడుతూ తలుపుల మండలం బిసి వెల్ఫేర్ హాస్టల్ లో వార్డెన్ గా విధులు నిర్వహిస్తున్న భాస్కర్ అనుచితంగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపించారు. విద్యార్థులను వేధిస్తున్నాడని విమర్శించారు. అనేక వివాదాలు ఉన్న వార్డెన్‌పై కేసుకూడా నమోదయిందన్నారు. అయితే ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోని అధికారులు మెడికల్ లీవ్ అనంతరం తలుపుల బీసీ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్ గా పంపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే వార్డెన్ తీరుపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

బత్తలపల్లిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ధర్మవరం టౌన్ : ప్రజల సమస్యలను తీర్చేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని రేగాటిపల్లి సర్పంచ్ సురేష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని రేగాటి పల్లిలో సురేష్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ప్రత్యేక అధికారి చాంద్ బాషా, జిల్లా పంచాయతీ అధికారి విజయకుమార్, విస్తరణ అధికారి మమతా దేవి, సర్పంచి సురేష్ రెడ్డిల ద్వారా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రవీందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సువర్ణ, మురళి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి టౌన్ : సమస్యల పరిష్కారమే జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశమని ఎంపీపీ అమర్నాథ్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని కదిరి రూరల్ మండలం ఏర్రదొడ్డిలో బుధవారం నిర్వహించారు. వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి సర్వే చేసి గుర్తించిన 372 సేవలను లబ్దిదారులకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అంజినప్ప, డివిజనల్ అభివృద్ధి అధికారి సూర్య నారాయణ, తహశీల్దార్ నటరాజ్, సర్పంచి తోటలక్ష్మి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : మండల కేంద్రంలోని బత్తలపల్లి-2 సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిఎస్ఒ వంశీకృష్ణారెడ్డి, డిపిఒ విజయకుమార్‌రెడ్డి, ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ధ్రువపత్రాలను ఈసందర్భంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యుగేశ్వరిదేవి, ఎంపీడీవో సౌజన్యకుమారి, ఇఒఆర్‌డి దివాకర్, సచివాలయ మండల కన్వీనర్ జయరామిరెడ్డి, ఉప సర్పంచు కోటి గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : ప్రతి ఒక్కరికి మంచి చేయాలన్న సదుద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని చేపట్టారని పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఘనత వైసిపికి దక్కుతుందన్నారు. 11 రకాల సేవలను 'జగనన్న సురక్ష' ద్వారా ఉచితంగా ప్రజలకు అందిస్తున్నామన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివశంకరప్ప, నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ, చైర్మన్ ఫరూక్, వైస్ చైర్మన్లు సునీల్, జయరెడ్డి, ఎంపీపీ గీతా రామ్మోహన్ రెడ్డి, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : కోడూరు పంచాయతీ కేంద్రంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచి మురళీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 817 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, ఎంపిడిఒ రామ్ కుమార్, వైస్ ఎంపిపి అంజలీదేవి, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: తాడిమర్రి మండలం పిన్నదరి గ్రామపంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సేవల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచి సదానంద, ఎంపిటిసి చంద్రబాబుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, ప్రత్యేక అధికారి డ్వామా పీడీ రామాంజనేయులు, తహశీల్దార్ నాగరాజు, ఎంపీడీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టిందని గ్రామ సచివాలయ జిల్లా కోఆర్డినేటర్ శివారెడ్డి, స్పెషల్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని గూని పల్లి గ్రామంలో సర్పంచి విజయ భాస్కర్ రెడ్డి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వైసిపి ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ సందర్భంగా1087 సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ సనావుల్లా, అగ్రి అడ్వైజరీ చైర్మన్ రమణారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, వ్యవసాయ అధికారి సతీష్ బాబు, సచివాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

5, 25 వార్డుల్లో మినీ మేనిఫెస్టో గురించి అవగాహన కల్పిస్తున్న నాయకులు

'టిడిపితోనే రాష్ట్రానికి భవిష్యత్తు'

ధర్మవరం టౌన్ : టీడీపీతోనే రాష్ట్రానికి భవిష్యతు ఉంటుందని తెలుగుదేశం నాయకులు అన్నారు. పట్టణంలోని 5, 25 వ వార్డుల్లో పర్యటించిన టిడిపి నాయకులు భవిష్యత్తుకు గ్యారెంటీ తొలి మేనిఫోస్టో గురించి ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, దేవరకొండ రామకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారెంటీ మినీ మేనిపేస్టో ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 25వ వార్డు సెక్షన్ ఇన్‌ఛార్జి గడ్డం సుజాత, గడ్డం అలివేలమ్మ, నాయకులు చీమలరామాంజి, గడ్డం సూరి, పూల సాయినాధ్, ఆదికేశవులు, రవి, 5వ వార్డు 174బూత్ కన్వీనర్ బాలమాలతి, సెక్షన్ ఇన్‌ఛార్జి సుధాకర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో కదిరి విద్యార్థుల సత్తా

కదిరి టౌన్ : జాతీయ స్థాయి పోటీల్లో కదిరి విద్యార్థులు ప్రతిభ చాటారని మాస్టర్ షెక్షా అన్నారు. గత నెల 29 నుంచి ఈనెల 3 వరకు నిర్వహించిన జాతీయస్థాయి ఓవినం మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న కదిరి విద్యార్థులుమంచి ప్రతిభ కనబరిచారన్నారు. కటా, కుమితే విభాగాలలో బ్లూ మూన్ ఇంటర్నేషనల్ స్కూల్ చెందిన విద్యార్థులు సిరి, నికిత, సమీరా, సాత్విక్, ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులు నాగ వర్షిత, వర్షిత, దీపిక, సోనీ, సనాసిద్ధిగా, సైన్స్ థామస్ స్కూల్ విద్యార్థులు డింబు శ్రీ, విగ్నేష్ ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థు నూరు మొహమ్మద్ శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు నాదియా తబుసం, చేతన్, జోష్ణ, వివేకనంద డిగ్రీ కళాశాల విద్యార్థులు బంగారు, వెండి పతకాలను సాధించారన్నారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఒలంపిక్ అసోసియేషన్ వెంకట్ నామి శెట్టి , ఐహెచ్‌ఆర్‌సి జాతీయ అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, పతకాలు అందజేశారు.

రైతులందరికీ నష్టపరిహారం ఇవ్వాలి

పెనుకొండ : పంట నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం అందించాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఏడాది రైతులు రెండుసార్లు అకాల వర్షాలతో పంట నష్టపోయారన్నారు. పంట నష్టపోయిన పొలాల వైపు ఎమ్మెల్యేలు గాని, ప్రభుత్వ అధికారులు కానీ వెళ్ళిన దాఖలాలు లేవన్నారు..2018-19 సంవత్సరానికి సంబంధించి రూ 943 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఉమ్మడి జిల్లాలకు విడుదల చేయాల్సి ఉండగా ఇంతవరకు దానిని ఇవ్వని చేతకాని ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమని విమర్శించారు. రైతు సమస్యలపై ఈ నెల 7న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమంలో రైతులు, రైతు సంఘ నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైసీపీ ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం : వైసీపీ ప్రభుత్వంలో వ్యవస్థలు అన్ని నిర్వీర్యం అయ్యాయని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ విమర్శించారు. పట్టణంలోని దర్గా పేటకు చెందిన ఖలీల్‌కు చెందిన నాలుగు సంవత్సరాల కుమార్తె సాఫియా గత 24రోజుల క్రితం ఇంటి దగ్గర నుంచి తప్పిపోయింది. ఇప్పటికి దాకా ఆచూకీ దొరకక పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో సవితమ్మ వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ పోలీసులు చిన్నారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు మరింత ముమ్మరంగా చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

ఓబులదేవర చెరువు : ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు సత్వర పరిష్కారం చూపాలని ఎంపిపి పర్వీన్‌బాను, జెడ్పీటీసీ కుర్లి దామోదర్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు చొరవచూపాలన్నారు. ఈసందర్భంగా పలువురు సభ్యులు తమ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈసమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఎంపిపి, జెడ్పీటీసీ ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపిటిసిలు, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కదిరి టౌన్ : ప్రజాసంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. కదిరి మున్సిపాలిటీ, మూర్తిపల్లి సచివాలయం, 34వ వార్డులోని మగ్గాల క్వార్టర్స్, పార్థసారధి కాలనీల్లో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రజాసంక్షేమ పథకాలు అమలు తీరు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్‌తో పాటు వైసిపి మాజీ సమన్వయకర్త ఇస్మాయిల్, వైస్ చైర్మన్ లు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, జడ్పీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు తదితరులతో పాటు నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి:కదిరి

O.S.717/2019

Between:

బసిరెడ్డి సరిత ...Plaintiff/Plaintiff

మరియు

బీర్ర వెంకటనారాయణరెడ్డి S/o లేట్ బి.నారాయణరెడ్డి, నాగిరెడ్డి పల్లి గ్రా॥, కదిరి (మం॥), శ్రీసత్యసాయి జిల్లా.ఇతరులు. ...Defendent/Defendent

పై దావాలో Plaintiff O.S.717/2019 దాఖలు చేసినారు సదరు పై దావా హాజరు నిమిత్తము 26-07-2023 వ తేదిన వాయిదా వేసినారు. సదరు దావాలో మీరు ఉదయం 10.30 గం॥లకు పై కోర్టువారి ఎదుట హాజకరు కావాలసినదిగా ఆదేశించడం అయినది. అట్లు మీరు హాజరుకాని యెడల పై దావాను మీ పరోక్షమున తీర్మానించుబడునని తెలియజేయడమైనది.

(కోర్టువారి ఆదేశాల మేరకు)

వాయిదా తేది:26-07-2023.

B.Rama Swamy, M.A., B.L.
Advocate, Kaidiri, Sri Satyasai Dist.
Cell: 9493363659.

In the Court of the Junior Civil Judge: Puttaparthy

O.S.No.305/2018

Between:

Balajinni gari Rami Reddy and another. ...Plaintiff

And

Karnatakam Thippa Reddy and others. ...Defendants

పై నెంబరు దావాలోని 3వ ప్రతివాదికి దావా సమన్లు

To,

D3: Busi Reddy gari Siva reddy, S/o Nalla Nagi Reddy, Karnatakam Nagepalli, Puttaparthjy Mandalam, Sathaya Sai District.

ఇందుమూలకముగా నీకు తెలియచేయడ మేమనగా పై నెంబరు దావాలోని వాదులు దావా షెడ్యూలు దాఖలా ఆస్తులు డిక్లరేషన్‌కు గాను మరియు పరమనెంటు యింజక్షనుకు గాను మీ మీద దావా దాఖలు చేసినారు. సదరి విషయమలై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల మీరు పై కోర్టులో 19-07-2023 వ తేదిన ఉదయం10.30 గం॥లకు ఖద్దున గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ వాదనను కోర్టువారికి తెలుపుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు పై దావాను తీర్మానము చేయుదుని యిందుమూలకముగా మీకు తెలియజేయడమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

ఆర్.శ్రీకాంత్‌రెడ్డి
వాదులపరం వకీలు, పెనుకొండ.